నమస్తే తెలంగాణ హైదరాబాద్, గురువారం 27 మార్చి 2025

# ఉన్నత విద్యామండలి చైర్మనే 'దోస్త్' కన్వీనర్

- ఇంటర్ ఫలితాలు రాగానే నోటిఫికేషన్

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలు కల్పించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) కన్వీనర్ ఎవరన్న అంశంపై స్పష్టతవచ్చింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్టారెడ్డియే వచ్చే విద్యాసం వత్సరంలో 'దోస్త్' కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మూడోవారంలో విడుదలయ్యే అవకాశాలున్నాయి. దీంతో 'దోస్త్' నోటిఫికేషన్ విడుదలకు ఉన్నత విద్యామండలి అధికారులు సన్నాహకాలు చేస్తున్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి డిగ్రీ కోర్సులకు రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు కామన్ అకాడమిక్ క్యాలెండర్‌ను రూపొందించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది.

# కొత్తగూడెంలో ఎర్త్‌సైన్స్ వర్సిటీ

- వర్సిటీగా అప్‌గ్రేడ్ కానున్న మైనింగ్ కాలేజీ
- ఈ వారంలోనే జీవో జారీ చేయనున్న సర్కారు

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా ఎర్త్ సైన్స్ వర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని మైనింగ్ కాలేజీని ఎర్త్‌సైన్స్ వర్సిటీగా అప్‌గ్రేడ్ చేయనున్నది. సంబంధించిన జీవో ఈ వారంలోనే విడుదలకానున్నది. వర్సిటీ ఏర్పాటుకు రూ. 500 కోట్లు, 100 పోస్టులు అవసరమని ఉన్నత విద్యామండలి అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ వర్సిటీలో మైనింగ్, ఎర్త్ సైన్స్, జియాలజీ, ఏఐ వంటి కోర్సులను ప్రవేశపెడతారు. దేశంలో ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీని నిర్వహిస్తున్నారు. కొత్తగూడెంలో మైనింగ్ వర్సిటీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన వచ్చినా ఆ తర్వాత వెనక్కి తగ్గారు. ధన్‌బాద్‌లో మైనింగ్ వర్సిటీ ఏర్పాటు చేసినా.. ఆ కోర్సులకు డిమాండ్ లేకపోవడంతో ఈ వర్సిటీని మూసివేసి, ఆ తర్వాత ఐఐటీగా అప్‌గ్రేడ్ చేశారు. మైనింగ్ వర్సిటీకి బదులు ఎర్త్‌సైన్స్ వర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

గురువారం । 27 । మార్చి । 2025
హైదరాబాద్ । www.sakshi.com

# చాకలి ఐలమ్మ వర్సిటీకి యూజీసీ గుర్తింపు

సుల్తాన్‌బజార్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గుర్తింపు లభించింది. తెలంగాణ విశ్వవిద్యాలయాలు (సవరణ) చట్టం–2025 ఆధారంగా వర్సిటీకి ఈ గుర్తింపు ఇచ్చింది. 2002 ఏప్రిల్‌లో అప్పటి ప్రభుత్వం కోఠి మహిళా కళాశాలను తెలంగాణ తొలి మహిళా విశ్వవిద్యాలయంగా గుర్తిస్తూ ప్రకటన జారీ చేయగా దాని పేరును వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా మారుస్తూ తెచ్చిన బిల్లును గతేడాది శీతాకాల సమావేశాల్లో అసెంబ్లీ ఆమోదించింది. ఈ గుర్తింపు ద్వారా విశ్వవిద్యాలయం వివిధ ప్రోత్సాహకాలను పొందేందుకు అర్హత సాధించింది. ఈ గుర్తింపు సాధించడంలో అండగా నిలిచిన అధికారులు, సిబ్బంది, విద్యార్థులకు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.